ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 17 జూన్ 2025 | 3

అంతర్వేది సముద్రంలో బోటు ప్రమాదం

» వేటకు బయలుదేరి ఇద్దరి మృతి
» నలుగురు సురక్షితం
5

యోగా సాధన ద్వారా.. ప్రశాంత జీవన శైలి

» జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
» ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయ ప్రాంగణంలో యోగాంధ్ర
5





యోగాంధ్ర కార్యక్రమంలో వేదికపై కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు, తదితరులు.. యోగాసనాలు వేస్తున్న జనం

జలామృత్!

పట్టణాలకు అమృత్ నిధులు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పట్టణాలు,నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుదల, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు విడుదలయ్యాయి. కేంద్రం అమృత్-2.0 పథకం ద్వారా ఇచ్చిన నిధులు సద్వినియోగపరచుకుంటూ రాష్ట్ర వాటా విడుదల చేస్తూ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థల వాటా విడుదల చేయకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటన్నింటికి తిరిగి అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.867.73 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మూడు నెలల్లోగా టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అసలేం చేస్తారు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థ పురాతనమైనది. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల ప్రస్తుతం ఉన్న తాగునీటి ప్రాజెక్టుల కెపాసిటీ సరిపోవడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడం, పైపులైన్ల ఏర్పాటుతో పాటు మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులు, కొత్తగా మురుగునీటి పారుదల నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు కేంద్రం అమృత్ పథకం ద్వారా నిధులు కేటాయిస్తోంది.ఇందులో కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో పాటు ఈ ప్రాజెక్టులు అమలయ్యే పట్టణ స్థానిక సంస్థలు తమ వాటా భరించాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది.

కూటమి ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్-2.0 పథకం నిధులు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రంతో సంప్రదింపులు జరిపి తమ వాటా విడుదలకు అంగీకారం తెలపడంతో నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, ఎనిమిది మునిసిపాలిటీలు,మూడు నగరపంచాయతీలకు 867.73 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ వాటర్ యాక్షన్ ప్లాన్ ట్రెంచ్ 1,2 ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(చామ్)లో నిర్వహించేందుకు ఆదేశాలివ్వడంతో అన్ని పనులు మూడు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించింది. పనులు 24 నెలల్లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ధేశించింది.ఈ పనులు పూర్తయితే పట్టణాలు, నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడి.ప్రజలకు తాగునీరందుతుందని భావిస్తున్నారు.

వైసీపీలో ఎక్కడివి అక్కడే..

వైసీపీ ప్రభుత్వం అమృత్-2.0 పథకం నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమృత్ నిధులు కేంద్రం మంజూరు చేసింది. దీంతో పట్టణాలు,నగరాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి వీలు ఏర్పడుతుందని భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోగా కేంద్రం ఇచ్చిన నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించారు. మంజూరైన పనుల్లో కొన్నింటిని మాత్రమే ప్రారంభించారు.వాటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం,స్థానిక సంస్థల నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. మెజార్టీ పనులు ప్రారంభమే కాలేదు.

- » తీరనున్న తాగునీటి వెతలు
- » పట్టణాల్లో ప్రాజెక్టులకు మోక్షం
- » ఉమ్మడి జిల్లాకు రూ.867 కోట్లు
- » అమృత్ 2.0 పథకంలో మంజూరు
- » చామ్ మోడల్‌లో పనులు
- » వైసీపీలో నిధులు మళ్లింపు
- » మూడు నెలల్లో టెండర్లకు పిలుపు

కాకినాడకు రూ.498.16 కోట్లు

కాకినాడ జిల్లాకు రూ. 498.16 కోట్లు విడుదలయ్యాయి. పిఠాపురం పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.57.37 కోట్లు, పెద్దాపురం పట్టణ పరిధిలో నీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 36.21 కోట్లు, తిరుపతిరాజు చెరువు ఆధునీకరణకు రూ.61 లక్షలు, పాత ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెద్ద చెరువు ఆధునీకరణకు రూ.90 లక్షలు, సామర్లకోట పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ. 38.98 కోట్లు, గొల్లప్రోలు పట్టణంలో ఆర్థికంగా వెనుకబడిన కాలనీల తాగునీటి సరఫరా పథకానికి రూ. 2.16 కోట్లు, మంచినీటి చెరువు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, తుని పట్టణంలో వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ.15.04 కోట్లు, ఏలేశ్వరం నగరపంచాయతీలో కప్పల చెరువు ఆ ధునీకరణకు రూ.74 లక్షలు మంజూరయ్యాయి. కాకినాడ నగరంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ. 256.48 కోట్లు మంజూరు కాగా, నగర పరిధిలో మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.82.87 కోట్లు, బోట్‌క్లబ్ పార్కు ఆధునీకరణకు రూ.2.70కోట్లు విడుదల చేశారు.

తూర్పునకు రూ. 296.83కోట్లు

రాజమహేంద్రవరం,నిడదవోలు మునిసిపాలిటీలకు రూ.296.83 కోట్లు మంజూరయ్యాయి.రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు రూ.92.78 కోట్లు, వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు రూ.95.14 కోట్లు, కంబాలచెరువు ఆధునీకరణకు రూ.3.70 కోట్లు,గంటాలమ్మ చెరువు ఆధునీకరణకు రూ.కోటిగోదావరి వద్ద పనులకు రూ.7.20 కోట్లు, ఆర్యాపురం ట్యాంకు ఆధునీకరణకు రూ.3.20 కోట్లు విడుదలయ్యాయి. నిడదవోలుకు ధవళేశ్వరం నుంచి గోదావరి జలాల సరఫరాకు రూ.83.82 కోట్లు, నిడదవోలు వీకర్ సెక్షన్ కాలనీ తాగునీటి సరఫరాకు రూ5.96 కోట్లు, మలకోడు చెరువుకు రూ.93 లక్షలు,వేస్ట్ వాటర్ ట్యాంకు ఆధునీకరణకు రూ. 3.60 కోట్లు మంజూరు చేశారు.

కోనసీమకు రూ.72 కోట్లు

కోనసీమ జిల్లాకు రూ.72.74 కోట్లు కేటాయించారు.అమలాపురం వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 11.51 కోట్లు, రామచంద్రపురం తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.15.20 కోట్లు, రామచంద్రపురంలో చెరువు ఆధునీకరణకు రూ.1.10 కోట్లు,మండపేట వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.29.02 కోట్లు, ముమ్మిడివరంలో తాగునీటి సరఫరా మెరుగుదలకు రూ.15.91 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.



రావులపాలెం మండలం గోపాలపురంలో నిల్వ చేసిన ఇసుక

ఇసుక.. పక్కదారి!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- » వర్షాకాలం కోసం జిల్లాలో భారీగా ఇసుక నిల్వలు
- » లక్ష్యాన్ని పూర్తి చేయకుండానే పక్కదారి పడుతున్న ఇసుక లారీలు
- » జిల్లాలో కీలక ప్రాంతాల్లో భారీగా ఇసుక కొండలు సిద్ధం

రానున్న వర్షాకాలంలో భవన నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా భారీస్థాయిలో ఇసుక నిల్వలను సిద్ధం చేస్తోంది. నిర్దేశించిన ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ముందస్తుగా పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను కూడా ఖరారు చేశారు. వర్షాకాలంతోపాటు రానున్న ఆగస్టు నెలలో వరదలు తీవ్రంగా వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా కోనసీమలో ఉన్న కీలకమైన ర్యాంపుల సమీపంలో 12లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ ఏర్పాట్లు చేశారు. స్టాక్ యార్డులకు భారీగా ఇసుక నిల్వలు తరలిస్తున్న ముసుగులోనే అంతకుమించి బహిరంగ మార్కెట్‌లోకి, లేఅవుట్‌ల్లో ఇసుకతో ఫిల్ చేసేందుకు గోదావరి ఇసుక ర్యాంపుల నుంచే లారీలు అక్రమంగా తరలిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గతంలో భారీ దోపిడీ

కోనసీమ జిల్లావ్యాప్తంగా ఉన్న గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి అనేక కీలక ప్రాంతాల్లో వందల కోట్ల విలువైన అపార ఇసుక నిల్వలున్నాయి. కొందరి కనుసన్నల్లో ఇసుక అక్రమ వ్యాపారం, భారీగా ఇసుక దోపిడీ గత ప్రభుత్వ హయాంలో జరిగింది. ఇప్పుడు కూడా కొన్నిచోట్ల జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. గతేడాది రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లావ్యాప్తంగా ఉన్న ఇసుక ర్యాంపుల నుంచి భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని అధికారికంగా ప్రకటించింది. ర్యాంపుల నుంచి ఇసుకను ఒక సామాన్య వ్యక్తి బయటికి తేవాలంటే చాలా కష్టమైన పనే. అందుకోసం స్థానికంగా ఉండే ఇసుక ర్యాంపుల ప్రతినిధులను ఆశ్రయించి వారి ద్వారా ఇసుకను పొందుతారు. ప్రస్తుతం టెన్‌టైర్ల లారీ ఇసుక ధర రూ.12వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతోంది. ప్రధానంగా గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదుల వెంబడి రాజకీయ సిఫార్సులతో అధికారుల అనుమతి తీసుకుని బహిరంగంగా నిత్యం కోట్ల రూపాయల విలువైన ఇసుక దోపిడీ జరుగుతోందని, అయినా అధికారులు చోద్యం చూడడానికే పరిమితమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి.

పూర్తికాని లక్ష్యం.. ర్యాంపుల మూత..

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ నిర్దేశించిన లక్ష్యాల మేరకు గోపాలపురం, కామనగరువు, జొన్నాడతోపాటు రావులపాడు, ఆలమూరు వద్ద భారీగా ఇసుక నిల్వలను సిద్ధం చేశారు. జిల్లా యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యానికి ఇంకా పూర్తిస్థాయి నిల్వలు సిద్ధం చేయలేదని సమాచారం. పూర్తిగా నిల్వలు పెట్టిన తరువాతే ఇసుక తవ్వకాలు అనుమతితో చేయాలి. ఇప్పటికే జిల్లాలోఉన్న కొన్ని ర్యాంపుల్లో వర్షాకాలం సీజన్‌లకు నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేసినందున ఆయా ర్యాంపులను మూసివేయాలని మైన్స్ అధికారులు ఇటీవల ఆదేశాలిచ్చారు. అయినా కొన్నిప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో ఒకట్రెండుచోట్ల మొక్కుబడిగా దాడులు నిర్వహించి కొన్ని వాహనాలు సీజ్‌చేశారు. అటు కె.గంగవరం మండలం, ఇటు అయినవిల్లి మండల పరిధిలో ఉన్న గౌతమీనది మధ్యలోని మన్నాస్ ట్రస్టు భూములనుంచి రేయింబవళ్లు యథేచ్ఛగా ఇసుక దోపిడీ ద్వారా కోట్ల రూపాయల మేర ఆదాయాలను ఆర్జిస్తున్నారు. జిల్లాకు చెందిన ఒక కీలక అధికార పార్టీకి చెందిన నేత కనుసన్నల్లో వారి అనుచరగణమే ఇసుకను యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా తరలించుకుపోతోందని అధికారులు చోద్యంచూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. స్టాకు యార్డుల పేరిట బోర్డులు పెట్టుకుని అనధికారికంగా లేఅవుట్లకు, ఇతర ప్రాంతాలకు తరలించి నిర్వాహకులు సొమ్ములు చేసుకుంటు న్నా యంత్రాంగం చోద్యం చూస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు



అమలాపురంలో విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జూన్16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను అందిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న విద్యామిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవితకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. అమలాపురం శ్రీగోపాలకృష్ణ గోఖలే పురపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆయన విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈవో షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం సాయిశ్రీనివాస్, నోడల్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, సీఆర్‌ఎంటీలు శ్రీనుబాబు, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 255 అర్జీలు



గోదావరి భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్జీలకు నూరుశాతం నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజాసమస్య ల పరిష్కార వేదికలో కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు 255 అర్జీలను స్వీకరించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్ ఎన్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఎల్డీఎం కేశవవర్మ, ఏఎస్పో శరత్, పౌరసరఫరాల మేనేజర్ నాగేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 25 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 25మంది నంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎంపీ హరీష్‌కు ఘనస్వాగతం



పహల్గాం ఘటనపై వివరించేందుకు అమెరికా సహా వివిధ దేశాల్లో పర్యటించి సొంత నియోజకవర్గానికి వచ్చిన టీడీపీ కేంద్ర పార్లమెంటరీ విప్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు అభిమానులు ఘనంగా స్వాగతం పలకగా.. క్రేన్ సహాయంతో ఎంపీకి గజమాల వేస్తున్న దృశ్యం

రాష్ట్ర విపత్తుల స్పందన దళానికి ప్రత్యేక స్థావరం: కలెక్టర్

అమలాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ సంభవించే తుఫాన్లు, గోదావరి వరదలు, చమురు సంస్థల గ్యాస్ లీకేజీలు వంటి విపత్కర పరిస్థితుల్లో ముంపు బాధితులను తక్షణమే ఆదుకుని ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించేందుకు అమలాపురం తహశీల్దార్ కార్యాలయం వెనుకఉన్న పాత జైలు భవనాన్ని రాష్ట్ర విపత్తుల స్పందన దళం స్థావరం ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం సబ్‌జైలు ప్రాంగణంలో ఉన్న భవనాన్ని ఆమె పరిశీలించారు. ప్రకృతి, మానవ నిర్మిత విపత్తులకు వెంటనే ప్రతిస్పందించడానికి వీలుగా ప్రత్యేక దళానికి స్థానికంగా స్థావరం ఏర్పాటు చేస్తే ఆస్తి, ప్రాణనష్టాలను గణనీయంగా తగ్గించవచ్చునన్నారు. ఈ బృందం విపత్తుల ఉపశమనంతోపాటు రెస్క్యూ కార్యకలాపాల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయన్నారు. ఆయన వెంట తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఉన్నారు.

డయేరియాపట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

అతిసార వ్యాధిపట్ల వైద్యశాఖ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అతిసార వ్యాధిపై ముద్రించిన ప్రచార కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. రానున్న రెండునెలలపాటు పల్లెలు, మురికివాడల్లో స్టాప్ డయేరియా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. దీనిలోభాగంగా ఈనెల 16 నుంచి ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు ఇస్తామన్నారు. జిల్లాలోని 2456 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా మందులు అందుబాటులో ఉంచామన్నారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టీవీవీ సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్ పాస్.. తీసుకున్నారా? 4

డ్వాక్రా మహిళలకు భరోసా



పిల్లల చదువు కోసం తపన పడే తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ మేరకు 'స్త్రీ నిధి' ద్వారా స్వల్ప వడ్డీకే రుణాలు అందించే కార్యక్రమానికి చర్యలు చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు అతి తక్కువ వడ్డీతో విద్యా రుణాలు అందించే ఏర్పాటు చేస్తోంది.

- పిల్లల చదువుల కోసం 4 శాతం (35పైసలు) వడ్డీకే స్త్రీ నిధి రుణం
- 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'గా అమలు చేయాలని నిర్ణయం
- త్వరలో అందించేందుకు కూటమి సర్కారు సిద్ధం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. స్కూలు, కాలేజీ ఫీజుల చెల్లింపు, పుస్తకాలు, యూనిఫామ్ కొనుగోలు, అదనపు కోర్సులు, ఇతరత్రా ఖర్చులు పెరుగుతుండడంతో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఉన్నత చదువులన్నీ దాదాపు ఖర్చుతో కూడుకున్నవే కావడంతో చాలా మంది బయట అధిక వడ్డీలకు అప్పులు చేసే పరిస్థితి ఉంది. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళల పిల్లల చదువు కోసం తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరిట ఈ రుణాలను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో కేవలం 35 పైసల వడ్డీకి రెండేళ్ల నుంచి మూడేళ్ల కాలపరిమితిపై అందించనున్నారు. రుణం పొందిన వారు కేజీ నుంచి పీజీ వరకు చదివే తమ పిల్లల విద్య కోసం మాత్రమే దీనిని ఖర్చు చేయాలి. అవసరమైతే వారికి సైకిళ్ల కొనుగోలుకు, చదువుకు సంబంధించి పరోక్ష ఖర్చుకు వినియోగించుకోవచ్చు. అధికారులు అడిగితే ఖర్చుకు సంబంధించిన రసీదులు చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వర్తింపజేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా త్వరలో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు కసరత్తు పూర్తి చేశారు.

కాకినాడ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,89,779 మంది ఉన్నారు. 38వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 38 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థుల్లో 80 శాతానికిపైగా పొదుపు సంఘాల పరిధిలోని కుటుంబాల వారే. ఇందులోనూ మూడొంతులకు పైగా పేద, నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. వీరందరూ కూడా తమ పిల్లల చదువుల కోసం స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవచ్చు. జిల్లాలో ఏటా స్త్రీ నిధి ద్వారా 28వేలమంది సభ్యులు రూ.253 కోట్లు వరకు రుణాలు పొందుతున్నారు.

హోయి హోయిగా..

- మోతుగూడెంలో ఇరువైపులా పచ్చదనంతో ఆహ్లాదకరంగా రహదారులు



శోభాయమానంగా ఉన్న చెట్లు

మోతుగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో చిగురించిన చెట్లతో మన్యం ఆహ్లాదకరంగా మారింది. నాలుగు రోజులుగా వాతావరణ మార్పు.. చిరుజల్లులు పడుతుండడంతో పచ్చదనంతో శోభాయమానంగా మారింది. మోతుగూడెం-గొడ్లగూడెం మధ్య రహదారులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాహనచోదకులు చల్లటి వాతావరణంలో ప్రయాణిస్తూ చక్కటి అనుభూతి పొందుతున్నారు.

'విసిరి'తే పతకమే!

- షాట్‌పుట్‌లో రాణిస్తున్న కాకినాడ యువతి లక్ష్మీ వేద సంహిత
- సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో బంగారు పతకం కైవసం



సాధించిన పతకాలతో లక్ష్మీ వేద సంహిత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ సమీపంలోని పచ్చిపులుసు వారి వీధిలో నివసిస్తున్న పి.చంద్రశేఖరరావు-అన్నపూర్ణ దంపతుల కుమార్తె లక్ష్మీ వేద సంహిత అథ్లెటిక్స్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుతం నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమె మేనత్త కరాటేలో బ్లాక్ బెల్ట్.. అనేక రంగాల్లోనూ ఆమె ఆరితేరారు. అదే స్ఫూర్తితో వేద సంహిత ఆటలపై... ముఖ్యంగా అథ్లెటిక్స్‌పై మక్కువ పెంచుకుంది. ఆరో తరగతి చదివే సమయంలో ఆమె క్రీడల పట్ల చూపిన ఆసక్తి, ఉత్సాహాన్ని గమనించి వ్యాయామ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు ప్రోత్సహించారు. దీంతో షాట్‌పుట్‌లో రాణిస్తూ పతకాలు సాధిస్తోంది. 2019లో జరిగిన ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వేద సంహిత తృతీయ స్థానంలో నిలిచింది. 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. 37వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచింది. తాజాగా ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగిన సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఒక్క షాట్‌పుట్‌లోనే కాదు.. కర్రసాము, టెన్నిస్‌ల్లోనూ రాణిస్తోంది. పెయింటింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తోంది. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని వేద సంహిత 'ఆంధ్రజ్యోతి'కి చెప్పింది.



స్టేట్ మీట్‌లో బంగారు పతకం అందుకున్న వేళ

స్టూడెంట్ బస్ పాస్.. తీసుకున్నారా?



- విద్యార్థులూ ఈ నిబంధనలు తెలుసుకోండి?
- కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి సూచనలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బస్‌పాస్‌ల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఆయా జిల్లా కేంద్రాల్లోని కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లోని బస్‌పాస్ కౌంటర్లను సంప్రదించాలని, ఉదయం 8గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఇవి అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.

విద్యార్థులు.. ఈ సూచనలు పాటించండి

బస్‌పాస్ కావాలనుకునే విద్యార్థులు ఈ కింద సూచనలు పాటించాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలతోపాటు ఫొటోతో buspassonline.apsrtconline.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి. దరఖాస్తుపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించి స్టాంప్ వేసి దాన్ని సంబంధిత డిపో కార్యాలయానికి సమర్పించాలి. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జత చేయాలి. విద్యార్థి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి. విద్యాసంస్థలు కూడా తరగతుల వారీగా విద్యార్థుల అడ్మిషన్ జాబితాను ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడి సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. లేకుంటే ఆ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు బస్ పాస్‌లు జారీ చేయరు. 12ఏళ్లలోపు బాలురు, 18ఏళ్లలోపు బాలికలు(10వ తరగతి వరకు ఉచిత బస్సు పాస్‌తోపాటు స్టూడెంట్ జనరల్ బస్సు పాస్(సంవత్సరం, త్రైమాసికం/నెలవారీ) పొందవచ్చని ప్రజారవాణా అధికారి తెలిపారు.

రాజమహేంద్రి మునిసిపల్ కమిషనర్ బదిలీ

గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా కేతన్ గార్గ్ నియామకం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్ నెం 1181ను జారీ చేసింది. కమిషనర్ కేతన్ గార్గ్‌ను గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ స్థానంలో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక 2024 జూలై 25న అప్పటి కమిషనర్ దినేష్‌కుమార్‌ను గుంటూరుకు బదిలీ చేసి కేతన్ గార్గ్‌కు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా కూటమి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కేతన్ గార్గ్ బాధ్యతలు స్వీకరించి వచ్చే నెలతో ఏడాది పూర్తవుతుంది. ఇప్పటికి 11నెలలు కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2027లో అతి పెద్ద ఈవెంట్ రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలతో పాటు, ప్లానింగ్ కేతన్ గార్గ్ సిద్ధం చేసుకున్నారు. అయితే గత రెండు నెలలుగా కమిషనర్‌ను బదిలీ చేస్తారనే సమాచారం ఉంది. కాని పుష్కరాల ముందు కమిషనర్ బదిలీ ఉండకపోవచ్చని అందరు భావించారు. మరో పక్క కమిషనర్ కూడా తనదైన శైలిలో రాజమహేంద్రవరంలో పనులు చేపట్టారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపు వేగవంతం చేశారు.సరిగ్గా ఇదే విధానం గతంలో విజయరామరాజు చేపట్టిన నెలలోపు ఆయన కూడా బదిలీ అయ్యారు. ఇప్పుడు అదే తరహాలో కమిషనర్ కేతన్ గార్గ్ బదిలీ జరగడం వెనుక.. కమిషనర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కావోచ్చనే వాదన వినిపిస్తోంది. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి ఎద్దడిని అధిగమించే యాక్షన్ ప్లాన్ చేయడం, ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు కార్యరూపం దాల్చేలా చేయడం వేగంగానే చేశారు. నగర ప్రజలలో తనదైన ముద్రను వేసుకున్నారు. కేతన్ గార్గ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పని చేసిన రెండో ఉన్నతాధికారిని నియమించనున్నట్టు తెలిసింది. ఆయన పదోన్నతిపై ముఖ్యస్థానంలో ఉన్నప్పటికి రాజమహేంద్రవరానికి ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. అయితే గత ప్రభుత్వంలో చేసిన సదరు అధికారిని కూటమి ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో వేచి చూడాలి. కేతన్ గార్గ్ మంగళవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

సోషల్ వెల్ఫేర్ అధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు విచారణకు విజిలెన్స్ సిఫారసు చేసింది. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా గతంలో పని చేసిన డీవీ రమణమూర్తి, ప్రస్తుత డీడీ ఎం.శోభారాణి, జేడీ రంగలక్ష్మిలపై విచారణకు ఆదేశించింది. వీరు గతంలో పనిచేసిన సమయంలో పలు పీజీ కోర్సుల విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 50శాతం క్షేత్రస్థాయి వెరిఫికేషన్ చేయకుండా మంజూరు చేశారనే అభియోగంపై విచారణకు ఆదేశిస్తూ లిఖిత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

అంతర్వేది, కేశవదాసుపాలెం ఏటిగట్లకు గండి.. కొబ్బరి, సరుగుడు తోటల్లోకి ఉప్పు నీరు

అంతర్వేది, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది, కేశవదాసుపాలెం గ్రామాల్లో సముద్ర తీర ప్రాంతాల వద్ద సోమవారం ఉదయం కెరటాల ఉధృతికి గట్లకు గండి పడింది. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు అంతర్వేది సగర సంగమం నుంచి కేశదాసు పాలెం, కేశనపల్లి, కరవాక వరకు తీర ప్రాంత గ్రామాలు ఉప్పు నీటి మయ్యాయి. వాతావరణంలో మార్పులు, అక్కడక్కడ కొద్ది పాటి వర్షాలు కురవడంతో సముద్రం వెంబడి ఉన్న తాత్కాలిక గట్లకు గడ్లు పడ్డాయి. సముద్రపు ఉప్పు నీరు అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం గ్రామాల్లో కొబ్బరి, సరుగుడు తోటల్లోకి తొచ్చుకుని వచ్చింది. 300 మీటర్ల ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాల తాకిడికి తీర ప్రాంతం కోతకు గురవుతోంది.



కొబ్బరి, సరుగుడు తోటలను ముంచుతున్న సముద్రనీరు

ఎస్ఐఎఫ్టీ ప్రిన్సిపాల్‌గా అంజలి



కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్టీ) ప్రిన్సిపాల్‌గా ఎస్.అంజలి (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కేడర్) సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతులకు మేలు జరిగే విధంగా ల్యాబ్‌ల ద్వారా పీసీఆర్, మేత నాణ్యత, నీటి నాణ్యత, మైక్రో బయాలజీ పరీక్షల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల చెరువుల వద్దకు వెళ్లి మొబైల్ ల్యాబ్ సేవలందిస్తామన్నారు. రైతులు సాగు చేసిన రొయ్యలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ఎస్‌సీఎంఎస్, జీసీఎంఎస్ ల్యాబ్‌ల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధించిన యాంటీ బయాటిక్స్ లేని రొయ్యల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆక్వా రైతులంతా ప్రభుత్వ ల్యాబ్ సర్వీసులను పూర్తిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిషింగ్ బోటు డ్రైవర్లకు శిక్షణలో భాగంగా ఇంజన్ రిపేరు నిర్వహణ, బోటు నడపడం, నావిగేషన్ సీమన్‌షిప్, వలల తయారీ రిపేరు, సముద్రంలో చేపల వేట అంశాలపై ఏడాది పాటు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 30శాతం జీవీఏ లక్ష్యాలు సాధించడంలో క్షేత్రస్థాయి సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ చేయడంలో తమ ఇనిస్టిట్యూట్ పాత్ర ఉంటుందని అంజలీదేవి వివరించారు.

ఆన్‌లైన్‌లో ఫైనల్ మెరిట్ లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరి 21న కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) విడుదల చేసిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి యాజమాన్యం ముఖ్యమైన సమాచారాన్ని విడుదల చేసింది. నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల తుది ఎంపిక పూర్తయ్యిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ పేర్లను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన ఉద్యోగ కేంద్రాలకు అనుగుణంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. పరిశీలన అనంతరం నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

24 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు

విజయవంతం చేయండి: ఆర్డీవో

పెద్దాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు జరిగే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి కోరారు. మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు 37 రోజులపాటు జరిగే జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ రాజేష్, ఎలక్ట్రికల్ ఏఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఎస్ఐ మౌనిక, దేవస్థానం సిబ్బంది రమణ, జనసేన పట్టణాధ్యక్షుడు పోల మరశెట్టి సత్తిబాబు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఆసాది రాయి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెండ్యాల నుంచి నీరు విడుదల

నిడదవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా కానూరు ఆయకట్టుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీటిని విడుదల చేసారు. డిస్ట్రిబ్యూటరీ కమిటి మాజీ అధ్యక్షుడు జుజ్జవరపు సూర్యభాస్కరరావు నీటిని విడుదల చేశారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఆయకట్టు ద్వారా మండలంలోని గోపవరం, పురుషోత్తపల్లి, కానూరు మీదుగా సుమారు ఏడు వేల ఎకరాలకు నీరు అందనుంది.

ఎ.అన్నవరంలో కొత్త జూనియర్ కళాశాల మంజూరు

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం ఎ.అన్నవరంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కొనసాగుతోంది. ఈ సంస్థకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తూ 2025-26 విద్యా సంవత్సరంలో శారద జూనియర్ కళాశాలగా కొనసాగేందుకు పాఠశాల విద్యా శాఖ జీవో నెం.239 జారీ చేసింది.

అంతర్జాతీయ సెమినార్‌లో రమ్యసుధ ప్రతిభ

ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు పొందిన రంగంపేట ఉపాధ్యాయిని



రమ్యసుధను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12, 13 తేదీల్లో నేపాల్ దేశంలోని ఖాట్మాండులో ఎంఐటీ వారు ఏర్పాటు చేసిన 'ఇన్నోవేటివ్ ప్రాక్టీసస్ ఫర్ అక్సిలరేటెడ్ గ్రోత్ ఇన్ కామర్స్ హ్యూమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో రంగంపేట ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. ఈ సెమినార్‌లో రమ్యసుధ సమర్పించిన 'రీ ఇన్‌వెంటింగ్ టుమార్ డ్రైవింగ్ గ్రోత్ త్రూ సెంటిఫిక్ ఇన్నోవేషన్' అనే పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన రమ్యసుధను హెచ్‌ఎం పార్థసారధి, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

6,527 మంది ఉపాధ్యాయులు బదిలీ

కాకినాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, ఎస్జీటీలకు సంబంధించి 6,527 మంది బదిలీ అయినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. జడ్పీ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా 96 మంది, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం నుంచి 10 మంది, స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారన్నారు. జడ్పీ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 28 మంది, ప్రభుత్వ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 19 మంది పదోన్నతి పొందినట్టు డీఈవో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 204 మంది పదోన్నతి పొందారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బదిలీలు,పదోన్నతుల ప్రక్రియ పూర్తయినట్టు డీఈవో తెలిపారు.

ఆరుద్ర కుమార్తెకు ఇంటి స్థలం

సీఎం చంద్రబాబు హామీ మేరకు పట్టా అందజేత



సాయిలక్ష్మికి పట్టాను అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం గొల్లగూడేనికి చెందిన రాజులపూడి ఆరుద్ర దివ్యాంగురాలైన తన కుమార్తె సాయి లక్ష్మీచంద్ర ఇటీవల జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును వివరించారు. దీంతో స్పందించిన ఆయన ఆమెకు ఉద్యోగంతోపాటు ఇళ్ల మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. దీనిలోభాగంగా కామనగరువులో 72గజాల స్థలాన్ని సోమవారం కలెక్టరేట్‌లో సాయిలక్ష్మీచంద్రకు కలెక్టర్ మహేష్‌కుమార్ అందజేశారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పిస్తామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

27న షర్మిల రాక

కడియం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజమహేంద్రవరం రానున్నట్టు జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో కడియంలో ప్రజాసామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీకే మాట్లాడుతూ ఏఐసీసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 7 బుల్లెట్ పాయింట్లను తయారు చేసిందన్నారు. వీటిని కరపత్రాల ద్వారా ఇంటింటికి కాంగ్రెస్ అనే నినాదంతో ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. ప్రస్తుతం సామాజిక న్యాయం జరగడం లేదని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టిన్ లూదర్, అరిగెల అరుణ కుమారి, వడయార్, కాకర్ల హరిబాబు, మోతా శారద, చిన్నం మురళి, భద్రం దొర, అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రంలో యోగాంధ్ర

- పాల్గొన్న కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

ఆత్రేయపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలోని జిల్లా స్థాయి ఫ్యామిలీ యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం ప్రశాంత జీవనశైలిని పొందవచ్చని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. యోగా భారతదేశ వారసత్వ సంపదగా అభివర్ణించారు. ఆధునిక జీవనశైలిలో అనేక రుగ్మతలతో బాధపడుతున్న తరుణంలో యోగా ప్రాణాపాయ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మూడు తరాలకు చెందిన సంతతి ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆహ్లాదకరమైన వాతవరణమైన వాడపల్లి పుణ్యక్షేత్రంలో యోగా సాధన చేయడం ఏర్పాట్లు తదితర అంశాలపై నిర్వహకులను అభినందించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఆయుష్ వైద్యుల పర్యవేక్షణలో ఓం శాంతి యోగా గురువులు ప్రదర్శన చేయించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్.రాజకుమారి, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన

వాడపల్లిలో జరిగిన యోగాంధ్రలో సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం



భారీగా హాజరైన ప్రజలు (డ్రోన్ ఫొటో)

దబ్బాదిలో ప్రబలిన డయేరియా

- వృద్ధురాలి మృతి
- రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 44 మంది గిరిజనులు
- వారిలో 12 మందికి పైగా పిల్లలు
- పులిహోర తిన్నామంటున్న గ్రామస్తులు





రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రౌతులపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్‌ప్లాన్ ఏజెన్సీ రాఘవపట్నం గ్రామశివారు దబ్బాదిలో డయేరియా ప్రబలింది. గ్రామానికి చెందిన వంతల చెల్లయ్యమ్మ(65) మృతిచెందింది. వెలుగు లోవరాజు, వంతు నాగసీత, వంతు గంగాభవాని, రొబ్బా వీరబాబుతో సహా సుమారు 44 మంది రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 నుంచి 12 ఏళ్లు ఉన్న పిల్లలు 12 మందికి పైగా ఉన్నారు. మంచాలు సరిపోకపోవడంతో డీసీహెచ్ఎస్ స్వప్న ఆదేశాలు మేరకు తుని ఏరియా ఆసుపత్రి తరలించారు. పాడేరు ఆసుపత్రిలో లోవరాజు, రమణ వైద్యం పొందుతున్నారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంతు రామయ్యమ్మ, నాగమణి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గ్రామంలో మోదకొండమ్మతల్లి ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి దబ్బాది, సుందరకోట, అనసగిరి గ్రామాలకు చెందినవారు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వ్యాన్‌పై 60 మందితో బయలుదేరారు. మార్గమధ్యంలో నర్శీపట్నం దాటిన తరువాత రాత్రి 8 గంటల సమయంలో వారి వెంట పట్టుకుని వెళ్లిన పులిహోర తిన్నారు. ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. స్నానాలు చేసి రామయ్యమ్మ,నాగమణి మొక్కు తీర్చుకున్నారు. తర్వాత వంటలు చేసుకుని తినడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కొందరికి కడుపు నొప్పితో విరోచనాలు పట్టుకున్నాయి. వారిని పాడేరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారికి బాగా ఉండడంతో వారితో పాటు మిగిలిన వారు బస్సులో బయలు దేరి ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం దబ్బాది చేరుకున్నారు. అనంతరం వారికి విరోచనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వంతల చెల్లయ్యమ్మ మృతిచెందడంతో ఒక్కసారిగా గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వైద్యం సిబ్బందికి విషయం తెలియడంతో హుటాహుటిన రౌతులపూడి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. గ్రామస్తులు తిన్న పులిహోరను వైద్య సిబ్బంది శాంపిల్ తీసి టెస్టులకు పంపించారు. దబ్బాది గ్రామస్తులంతా తమ వారి కోసం రౌతులపూడి ఆసుపత్రికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు టీడీపీ యువనేత సోమ రౌతు చంద్రమౌళి భోజనాలు అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జిల్లా వైద్యాధికారి డా.నరసింహ నాయక్ పరామర్శించారు. ఆసుపత్రిలో పరిస్థితులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు.

సంద్రంలో వేటకు వెళ్లి మృతదేహాలుగా తేలి..

- ఇద్దరు మత్స్యకారులు మృతి
- మరో నలుగురు సురక్షితం
- కోనసీమ జిల్లా అంతర్వేదిలో ప్రమాదం



అంతర్వేదిలో లభ్యమైన నాగిడి రాము, తమ్ముడు పోతురాజు మృతదేహాలు

అంతర్వేది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం వేటకు బయలుదేరి అంతర్వేది సముద్ర తీరంలో ఇద్దరు మత్స్యకారులు గల్లంతై మృతదేహాలుగా తేలారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్ర తీరంలో సోమవారం ఉదయం బోటు ప్రమాదం జరిగి ఇద్దరు మృతిచెందగా మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణాజిల్లాలోని నాగలలంక గొల్లలమూత గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు ఆదివారం వేటకు బయలుదేరారు. ఐఎడీఏపీకే3 ఎం089 శ్రీకనకదుర్గ బోటు యజమాని నాగిడి వెంకటేశ్వరరావు బోటులో కృష్ణా జిల్లా నుంచి వేటకు బయలుదేరి బందరు మీదుగా అంతర్వేది చేరుకునేసరికి సోమవారం ఉదయం వాతావరణంలో వచ్చిన మార్పులకు సాగర సంగమం వద్ద అలల ఉధృతికి కెరటాలు ఒక్కసారిగా బోటుపై పడడంతో బోటుపైన ఉన్న నాగిడి రాము (20), తమ్ముడు పోతురాజు(50) జారి సముద్రంలో పడిపోయారు. సాటి మత్స్యకారులు వారిని కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఉవ్వెత్తున ఎగసిపడుతూ కెరటాల రావడంతో సాగర సంగమం మొగ వద్ద గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం మిగిలిన నలుగురు మత్స్యకారులు వెతకసాగారు. కెరటాలు అధికంగా రావడంతో అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు చేరుకుని స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. విశ్వనాథపల్లి సత్యనారాయణ, విశ్వనాథపల్లి నాగరాజు, విశ్వనాథపల్లి సామోరు, నాగిడి వెంకటేశ్వరరావు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన ఇద్దరి మృతదేహాలు గంటల వ్యవధిలోనే లభ్యం కావడంతో సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో క్షతగాత్రులు

వై.రామవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతా రామరాజు జిల్లా వై.రామవరం మండలం పనసల పాలెం ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పి.ఎర్రగొండకు చెందిన కోండ్ల బాబిరెడ్డి చవిటి దిబ్బలు నుంచి బైక్‌పై పి.ఎర్రగొండ వస్తున్నాడు. ఎదురుగా వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్తున్న మిరియాల సాయి, భూముల కొండబాబుల బైక్ ఢీకొని ముగ్గురూ గాయపడ్డారు. వై.రామవరం ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యానికి ఇద్దరిని కాకినాడ, ఒకరిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాబి రెడ్డి ఫిర్యాతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు దాడి

14 మందిపై హత్యాయత్నం కేసులు

ఆలమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసిన సంఘటనలో ఇరు వర్గాలను అదుపు చేసి 14మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈనెల 15న రాత్రి కోనసీమ జిల్లా ఆలమూరు ఎర్రకాలనీ సమీపంలో పలివెల తేజ, కొమ్ము రోహిత్‌కి చెందిన వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడానికి కొట్లాటకు దిగారు. ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వారు అందించిన సమాచారం మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఒక వర్గానికి చెందిన పలివెల తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గునుపల్లి నాగసాయికృష్ణప్రసాద్, కొమ్ము రోహిత్, గౌరి శంకరర్, కొమ్ము నారాయుడు, ఆదినారాయణ, చల్లా సందీప్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. అలాగే మరోవర్గానికి చెందిన కొమ్ము రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలివెల తేజ, దొనకొండ మోషే, దొనకొం విజయ్, పొలమూరు ప్రసన్న, తోరాటి ఏసు, వేమగిరి అనిల్, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

గండేపల్లిలో రూ.5.53 లక్షల విలువైన 50 గంజాయి ప్యాకెట్ల స్వాధీనం



గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న గండేపల్లి, జగ్గంపేట పోలీసులు

జగ్గంపేట/ గండేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా జగ్గంపేట సీఐ కార్యాలయంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వెల్లడించారు. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు ఆపారు. నెలూరు జిల్లాకు చెందిన కల్లపల్లి నాగేంద్ర, కడప జిల్లాకు చెందిన షేక్ సుధార్‌వల్లి, పందిళ్లపల్లి శివకుమార్, ఓ మైనర్ ఉన్నారు. కారులో 110.640 కిలోల గంజాయి ఉంది. వారిని అదుపులోకి తీసుకుని 50 గంజాయి ప్యాకెట్లు, 4 ఫోన్లు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురు సీలేరు నుంచి తిరుపతి మీదుగా తమిళనాడుకు చెందిన వ్యక్తికి గంజాయి రవాణా చేస్తున్నారని డీఎస్పీ వివరించారు. గంజాయి విలువ రూ.5,53,200 ఉంటుందన్నారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్లో కేసు చేశామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, దర్యాప్తులో పాల్గొన్న గండేపల్లి ఎస్ఐ యువి.శివ నాగబాబు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, ఎస్ఐలు శివనాగబాబు, రఘునందనరావు ఉన్నారు.

పోలిపాకలో ఇద్దరి అరెస్ట్

కూనవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఇద్దరిని కూనవరం పోలీసులు పట్టుకున్నారు. కూనవరం ఎస్ఐ లతాశ్రీ కథనం ప్రకారం.. అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక శివారు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా నెల్లపాక నుంచి కూనవరం వైపుగా ద్విచక్రవాహనం (ఏపీ40ఏఎఫ్ 4943)పై వస్తున్న ఇద్దరు పోలీసులను చూసి ద్విచక్రవాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని ఎస్ఐ లతాశ్రీ, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా 21 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, ఫోన్‌ను సీజ్ చేశారు. వారికి గంజాయి అమ్మిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.1,05,000 ఉంటుందని ఆమె చెప్పారు.



గంజాయితో ఇద్దరిని పట్టుకున్న కూనవరం పోలీసులు

శానిటేషన్ మెరుగుపడకపోతే చర్యలు



శానిటరీ సూపర్‌వైజర్లతో సమావేశమైన ఈవో సుబ్బారావు

- అన్నవరం దేవస్థానం ఈవో హెచ్చరిక
- శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష

అన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటేషన్ నిర్వహణపై భక్తుల్లో 50శాతం మాత్రమే సంతృప్తి ఉందని, పరిస్థితి మెరుగుపడకపోతే చర్యలు తప్పవని ఈవో వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్రం గదుల్లో నిర్వహణ సరిగా లేదని, భక్తులకు శానిటేషన్ సిబ్బంది వారు కోరిన సమాచారం అందించాలని, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా ఎవరో వస్తారని చూడకుండా తక్షణ సాయం అందించాలన్నారు. ప్రతిశానిటరీ సూపర్‌వైజర్ వద్ద దేవస్థానం వైద్యుని, అంబులెన్స్ ఫోన్ నెంబర్లు ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఇక్కడ జరిగే శానిటేషన్ నిర్వహణ దేవదాయశాఖ ప్రధాన కార్యలయం, సీఎంవోలో నివేదిక రూపంలో ఉంటుందని జాగ్రత్తగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సూపరెంటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దినుసులు పరిశీలన

అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులును సోమవారం ఆహార నియంత్రణ అధికారి సుబ్బారావు సోమవారం పరిశీలించారు. ఇప్పటివరకు టెండర్ దాఖలు సమయంలో వీటిని పరిశీలించి హడావిడిగా ముగించేవారు. ఈనెల 20న టెండర్లు తెరవనున్న సమయంలో ముందస్తుగా టెండర్‌దారులు సరఫరా చేయనున్న దినుసుల శాంపిల్స్ తీసుకురావాలని ఈవో సుబ్బారావు గుత్తేదారులను ఆదేశించి నాణ్యత ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం తీసుకొచ్చిన శాంపిల్స్ ఏ విధంగా ఉన్నాయో టెండర్ ఖరారయ్యాక ఇదే నాణ్యతతో కూడిన దినుసులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌స్టోర్స్ అధికారులు భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

గోదావరిలో మునిగి కరప యువకుడి మృతి



సాయికృష్ణ (ఫైల్‌ఫొటో)

కరప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక బ్రిడ్జి కింద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన కరప యువకుడి మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమయ్యింది. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన నరాల సాయికృష్ణ(17) ఆదివారం మిత్రులతో కలిసి యానాం వెళ్లాడు. యానాం-ఎదుర్లంక బ్రిడ్జి దాటిన తరువాత గోదావరిలో స్నానానికి దిగాడు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో సాయికృష్ణ గల్లంతయ్యాడు. స్నానానికి దిగిన మిగిలిన మిత్రులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బోట్ల ద్వారా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆదివారం సాయంత్రం సాయికృష్ణ స్నానానికి దిగిన చోటనే శవమై తేలడంతో పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చారు. విగతజీవిగా పడిఉన్న సాయికృష్ణను చూసి కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సాయికృష్ణ తండ్రి బుజ్జి, తాత రామకృష్ణ కరపలో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పెద్దాపురంలో వ్యక్తి దారుణ హత్య

- కేసు నమోదు చేసిన పోలీసులు
- పలు కోణాల్లో దర్యాప్తు



శ్రీనివాస్ ఫైల్‌ఫొటో



హత్యకు గురైన శ్రీనివాస్

పెద్దాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు కట్టమూరు పుంత ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం గోనెడ గ్రామానికి చెందిన జానకి సత్య శ్రీనివాస్ అలియాస్ వెంకన్నబాబు (32) స్థానికంగా ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడు శ్రీనివాస్ హత్యకు గురి కావడానికి సంబంధించి పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. పదునైన ఆయుధంతో మెడ భాగంలో బలంగా కొట్టి చంపినట్లు తెలుస్తోంది. మృతదేహం వద్ద బీరు బాటిల్‌కు సంబంధించిన గాజు ముక్కలు ఉండటం కూడా పలు అనుమానాలు కలిగిస్తోంది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో శ్రీనివాస్ అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధమా లేక మద్యం మత్తులో ఎవరైనా హత్య చేశారా మరే ఇతర కారణమేదైనా ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తును చేస్తున్నారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. దీనిపై కేసును నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

బిక్కవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి శెట్టిబలిజపేటకు చెందిన మేడిశెట్టి వెంకటరమణ (45) మద్యానికి డబ్బులివ్వలేదని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పందలపాక గ్రామంలో జరిగింది. ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. వెంకటరమణ జట్టు కూలీగా పందలపాకలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం వర్షం కారణంగా పని లేకపోవడంతో మద్యం కోసం ఇంట్లో తల్లి, కుమారుడిని రూ.100 అడిగాడు. వారు లేదనడంతో మిల్లు వద్ద మరో కూలీని డబ్బులు అడిగాడు. అతడు కూడా లేవనడంతో మిల్లు ముందు ఉన్న రేకుల షెడ్డుతో టవల్‌తో ఉరి వేసుకుని మృతిచెందాడు. మిల్లు వాచ్‌మెన్ ఆదివారం రాత్రి పది గంటలకు ఉరి వేసుకున్న వెంకటరమణను చూసి సమాచారం ఇవ్వడంతో తాము కేసు నమోదు చేసి మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ వివరించారు.



వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

తరలిన తల్లిలోకం!



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. దీంతో వాటిని తీసుకోవడానికి కాకినాడ మెయిన్‌రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద లబ్ధిదారులు ఇలా కిక్కిరిసేలా క్యూ కట్టారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ





నిద్ర గమ్మత్తు!

పూట గడవడానికి కష్టపడి అలసిపోయిన ఓ రిక్షా కార్మికుడు రోడ్డు పక్కన ఓ ఇంటి ఆవరణలో ఆదమరిచి నిద్రపోతుంటే పక్కనే రెండు శునకాలు కూడా కునుకువేశాయి. కాకినాడలో గమ్మత్తుగా కనిపించిన ఈ చిత్రాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ఘనంగా లంకాలమ్మ అమ్మవారి జాతర

అంబాజీపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముక్కామల గ్రామదేవత శ్రీలంకాలమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో గరగనృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తొండవరం గ్రామదేవత శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

మండల పరిషత్ ఏవోగా నరసింహమూర్తి

ఐ.పోలవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ పాలనాధికారిగా మంతా లక్ష్మీనరసింహమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉప్పలగుప్తం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన లక్ష్మీరెడ్డి శంఖవరం మండలానికి బదిలీ అయ్యారు.

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీలంతా పేద కుటుంబాలకు చెందిన వారని, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనాలు అందించడం లేదని, ప్రభుత్వం అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికేనా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేకపోతే ఉద్యమిస్తామని కార్యదర్శి ఎం.జయలక్ష్మి హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో వీరవేణి, సుబ్బలక్ష్మి, బొక్కా బేబిసుజాత, పి.పద్మ, కె.ఆశాజ్యోతి, జె.మేరీ స్వాతి, విజయదుర్గ, కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఇవ్వాలి

అంబాజీపేట, జూన్16(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించి తల్లికి వందనం నగదు ఇవ్వక పోవడం దారుణమన్నారు. రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల మదిలో మోదీ: కబర్థి



మలికిపురం: సభలో ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

మలికిపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల హృదయాల్లో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారని బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి, పశ్చిమగోదావరి జిల్లా మాజీ ఏఎంసీ చైర్మన్ ఉన్నమట్ల కబర్థి అన్నారు. సోమవారం మలికిపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణుక్య అధ్యక్షతన నరేంద్రమోదీ 11ఏళ్ల పాలన విజయవంతంగా ముగిసిన సందర్భంగా జరిగిన సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అందరితో కలిసి అందరి అభివృద్ధి, అందరి కృషి, అందరి విశ్వాసం అనే మంత్రంతో దేశంలో ప్రతీ పౌరుడిని అభివృద్ధి స్రవంతిలోకి ప్రధాని మోదీ తీసుకువచ్చారని అన్నారు. ప్రధాని అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల అందరి మదిలోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి తమలంపూడి రామకృష్ణారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అడబాల రాంబాబు, ఇందుకూరి అచ్యుతరామరాజు, రాంబాబు, చాణుక్య తదితరులు పాల్గొన్నారు.

మోదీతో సుపరిపాలన

మామిడికుదురు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో దేశంలో సుపరిపాలన జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంవే వేమా పేర్కొన్నారు. మోదీ సుపరిపాలన 11ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమం పాశర్లపూడి బాడవలో మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగింది. కార్యక్రమంలో వేమా మాట్లాడుతూ నోట్ల రద్దు వల్ల నల్లధనం, నకిలీ నోట్ల చెలామణి ఆగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాలే శ్రీనివాసనగేష్, చెల్లింగి త్రినాథ్, మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహలక్ష్మిరావు, నక్కా త్రిలోచనరావు, వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి గంగాధర్, కోటిపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ హరీష్‌మాధుర్‌కు ఘన స్వాగతం

ముగిసిన విదేశీ పర్యటన



మలికిపురం: ఎంపీ హరీష్‌మాధుర్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

అమలాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అమెరికా సహా వివిధ దేశాల్లో పర్యటించి సొంత నియోజకవర్గానికి వచ్చిన కేంద్ర టీడీపీ పార్లమెంటరీ విప్, అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్‌కు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కశ్మీర్‌లోని పెహల్గాంలో పాకిస్థానీ ఉగ్రవాదులు చేసిన దాడిలో అమరులైన ఘటనతో పాటు పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పేరిట చేసిన ఆవశ్యకతను ప్రపంచ దేశాలకు వినిపించేందుకు ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో కొందరు పార్లమెంటు సభ్యుల బృందం అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాల పర్యటన్ను విజయవంతంగా ముగించుకుని సోమవారం సాయంత్రం నియోజకవర్గానికి ఎంపీ హరీష్‌బాలయోగి వచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అభిమానులు, టీడీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి తాళ్లరేవు వద్ద ఎంపీ హరీష్‌కు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, పూలదండలతో ముంచెత్తి అభిమానాన్ని చాటుకున్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా అమలాపురం చేరుకున్న ఎంపీ హరీష్‌బాలయోగి నల్లవంతెన దిగువనున్న జీఎంసీ బాలయోగి ఘాట్‌కు చేరుకుని అక్కడ తండ్రి బాలయోగి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎంపీ నివాసానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీ పర్యటనలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో క్రేన్లతో దండలు ఏర్పాటు చేసి బాణసంచా కాలుస్తూ అభిమానులు హరీష్‌కు ఘన స్వాగతం పలికారు.

రాజోలు నాయకుల ఘన స్వాగతం

మలికిపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిని, ఆపరేషన్ సిందూర్ పరిస్థితులను అమెరికా, పనామా, దయానా, బ్రెజిల్, కొలంబియా దేశాల్లో పర్యటించి అఖిలపక్ష బృందంలో సభ్యునిగా భారతదేశ వాణిని వినిపించి సోమవారం నియోజకవర్గానికి విచ్చేసిన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు తెలుగుదేశం పార్టీ రాజోలు నాయకులు స్వాగతం పలికి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, మంగెన నాని, అడబాల విజయ్, ఈలి శ్రీను, వర్ధినీడి బాబ్జి, అడబాల విజయ్, సాపే కాశీ, అప్పారి వెంకటేశ్వరరావు, కడలి మోహన్ పాల్గొన్నారు.

స్వాగతం పలికిన గుబ్బల

రాజోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గాంలో పాకిస్తాన్ ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ ఆవశ్యకత పరిస్థితులపై ప్రపంచ దేశాలకు భారతదేశ గొంతును వినిపించేందుకు పార్లమెంటరీ అఖిలపక్ష బృంద సభ్యుడిగా వెళ్లి సోమవారం అమలాపురం నియోజకవర్గానికి విచ్చేసిన ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ఘనస్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చాగంటి స్వామి, జగడం సత్యనారాయణ, అడబాల యుగంధర్, మంగెన నాని, అడబాల విజయ్, ఈలి శ్రీనివాస్, ముప్పర్తి నాని, వర్ధినీడి బాబ్జి, కడలి మోహన్, అప్పారి వెంకటేశ్వరరావు, సాపే కాశీ, విష్ణు, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచక పాలన'

పి.గన్నవరం, జూన్16(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అరాచకంతో పాలన సాగి స్తోందని వైసీపీ నియోజ కవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు విమర్శించారు. పి.గన్నవరంలో సోమవారం జరిగిన జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తక విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్ కుమార్, బూడిద వరలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరావు, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, మెల్లం మహలక్ష్మీప్రసాద్, కొంబత్తుల ఏసు పాల్గొన్నారు.

పాలనాధికారిగా తులసీకృష్ణ

ఉప్పలగుప్తం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ పాలనాధికారిగా భూపతిరాజు తులసీకృష్ణ నియమితులయ్యారు. ఆయన కాకినాడ కలక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన మంతా లక్ష్మీనరసింహమూర్తి ఐ.పోలవరం మండలం బదిలీ అయ్యారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలి

- కలెక్టరేట్‌లో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై వినతులు





కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, అల్లవరానికి చెందిన కడలి అరుణ తదితరులు

అమలాపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని జిల్లా నలమూలల నుంచి వచ్చిన అంగన్‌వాడీల గోదావరి భవన్‌లో అర్జీలు అందించారు. తొలుత కలెక్టరేట్ ఎదుట పలు సమస్యలపై నిరసనలు తెలిపారు. అంగన్‌వాడీ కుటుంబాల్లోని పిల్లలకు తల్లికి వందనంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ రూ.11,500, హెల్పర్‌కు రూ.7000 గౌరవ వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్‌వాడీలు నమోదు కావడంతో సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌లో అర్జీ అందించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లాశాఖ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, కోశాధికారి పి.అమూల్య, ప్రాజెక్టు ప్రతినిధులు పార్వతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : అల్లవరానికి చెందిన కడలి అరుణ తదితరులు

అల్లవరం వీరన్నమెరకకు చెందిన తన భర్త కడలి నాగేంద్ర కిరణ్‌కుమార్‌తో పాటు అడ్డువచ్చిన ఆడపడుచుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కడలి అరుణ గ్రామస్తులతో కలిసి అర్జీ అందించారు. గాయపడ్డ వారిపైనే ముందుగా పోలీసులు కేసు నమోదు చేశారని బాధితుల కేసు నమోదు చేయడానికి ఇష్టపడలేదని చివరకు గ్రామపెద్దలు ప్రశ్నించడంతో కేసు నమోదు చేశారని అర్జీలో వివరించారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని అరుణతో పాటు గ్రామస్తులు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో అర్జీ అందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : శంకరరావు తదితరులు

తెలంగాణలో ఇంజనీరింగ్ చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలచేసి ఆదుకోవాలని కోరుతూ సోమవారం అర్జీ అందించారు. రెండేళ్లకు పైబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారన్నారు. అర్జీ అందించిన వారిలో అడపా శంకరరావు, కొరసాల వెంకటరమణ, అడపా వీరనూకమాచరరావు తదితరులు పాల్గొన్నారు.

రబీ ధాన్యం సొమ్ములు చెల్లించాలి: కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మే నెల 8 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు విక్రయించిన ధాన్యానికి ఇంత వరకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని కోనసీమ రైతు పరిరక్షణ సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు అన్నారు. సంఘ ప్రతినిధులు కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీ అందించారు. గత రబీ సాగు కోసం అప్పు చేసిన బాకీలపై వడ్డీ భారం పెరిగిపోతుందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. అర్జీ అందించిన వారిలో సంఘ ప్రతినిధులు మంగెన నరసింహారావు, యెరుబండి లక్ష్మయ్య, అప్పారి చినవెంకటరమణ, పెమ్మిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటకాల్వ కలుషితం : అల్లవరం మండలం నాయకులు

అల్లవరం మండలం దేవగుప్తం, గుండెపూడి గ్రామాల మీదుగా వెళ్లే పంటకాల్వ వ్యర్థాలతో కలుషితం అయిపోతుందని నాయకులు, రైతులు అర్జీ అందించారు. కాల్వ పొడవునా ఆక్రమణలకు గురికావడంతో పంటకాల్వ కాస్తా పంట బోదెగా మారిపోయి శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాల్వనీరు కలుషితం కాకుండా ఆక్రమణలు తొలగించి రైతులను ఆదుకోవాలని గుంటూరి బాలరాజు, వేగిరాజు వెంకట్రాజు, సాధనాల వెంకట్రావు, మాకే కృష్ణమూర్తి, పినిపే ప్రకాష్ కోరారు.

మధ్యాహ్న భోజన పథకంపై నిరంతర పర్యవేక్షణ



కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురంరూరల్,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ సన్నబియ్యంతో తొలిసారిగా మధ్యాహ్న భోజన పథకానికి ఈఏడాది నుంచి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులకు రుచికరమైన ఆరోగ్యవంతమైన భోజనాన్ని అందించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. కొంకాపల్లి డాక్టర్ జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. వంటచేసే ప్రాంతంలో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలన్నారు. వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. హెచ్ఎం సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రవల్లికకు అవార్డు ప్రదానం

రాజోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి షైనింగ్ స్టార్స్ పురస్కారం అందుకున్న లిఖితపూడి బుజ్జి కుమార్తె ప్రవల్లికకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దళిత చైతన్యవేదిక అంబేడ్కర్ విద్యా కుసుమాలు అవార్డును సోమవారం ప్రదానం చేసింది. పొదలాడలో జేఏసీ మండలాధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన సత్కార సభ నిర్వహించారు. రాజోలు వైస్‌ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిశోర్ చేతులమీదుగా అంబేడ్కర్ విద్యా కుసుమాలు అవార్డును ప్రవల్లికకు ప్రదానం చేశారు. ప్రవల్లికను, తల్లిదండ్రులు నాగలక్ష్మి-బుజ్జిలను దళిత చైతన్యవేదిక నాయకులు అభినందించారు.

రక్తదానం చేసిన గిడుగు

రాజోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కడలికి చెందిన వానపల్లి భగవన్నారాయణ అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకుంటున్నారు. భగవన్నారాయణకు బి పాజిటివ్ బ్లడ్ కావాలని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో మెరకపాలేనికి చెందిన జనసేన సీనియర్ నాయకుడు గిడుగు చంద్రశేఖర్ రక్తదానం చేశారు. ఇప్పటివరకు చంద్రశేఖర్ 24సార్లు రక్తదానం చేశారు. చంద్రశేఖర్‌ను సర్పంచ్ గిడుగు బుజ్జిబాబు, మాజీ ఉపసర్పంచ్ అడబాల సత్యరమేష్, అడబాల రామకృష్ణ, జున్నూరి పండు అభినందించారు.

నివాసగృహాల వద్ద మద్యం షాపును తొలగించాలి

మామిడికుదురు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పెదపట్నం గ్రామంలో నివాస గృహాల దగ్గరలో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును నిరసిస్తూ స్థానికులు సోమవారం ధర్నా చేశారు. గతంలో కూడా ఇదేవిధంగా బ్రాందీ షాపు ఏర్పాటుచేస్తే తాము అడ్డుకొనగా ఆ షాపును వేరే చోటుకు మార్చారని మళ్లీ ఇప్పుడు అదే ప్రాంతంలో షాపును ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల తాము నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని, వెంటనే బ్రాందీ షాపు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈనిరసనలో కుక్కల వేణు, గెద్దాడ సావిత్రి, చెల్లింగి సత్యనారాయణ, గెద్దాడ సందీప్, ముత్యాల సుబ్రహ్మణ్యం, అరిగెల కృష్ణవేణి, కుక్కల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వరోగ నివారిణిగా యోగా

అమలాపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సర్వరోగ నివారిణిగా పని చేస్తోందని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం కోనసీమ వాకర్స్ క్లబ్ ప్రతినిధులతో యోగా శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీస్వామివివేకానంద యోగాశ్రమం గురువారం ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు యోగాసనాలు వేశారు.

విద్యుత్ బిల్లులు సవరించండి



అమలాపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని విద్యుత్ శాఖ ఈఆర్వో కార్యాలయం సోమవారం జనంతో కిక్కిరిసిపోయింది. తల్లికి వందనం పథకం వర్తించాలంటే విద్యుత్ బిల్లు 300యూనిట్లు దాటి ఉండరాదు. అయితే పలువురు నిరుపేదల ఆధార్‌కార్డులకు ఇతరుల విద్యుత్ మీటర్లు లింక్ కావడంతో ఒక్కొక్కరికీ 300నుంచి వెయ్యి యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులు చూపించడంతో వారంతా లబోదిబో మంటూ ఈఆర్వో కార్యాలయం వద్ద బారులు తీరారు. తమ విద్యుత్ బిల్లులను సవరించి తమకు తల్లికి వందనం వర్తింప చేయాలని వేడుకుంటున్నారు.

కమిషనర్‌గా నిర్మల్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ



అమలాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వి.నిర్మల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నిర్మల్‌కుమార్ ఇప్పటి వరకు అమరావతి డెవలెప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, అధికారులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులను, అధికారులను సమన్వయం చేసుకుంటూ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని నిర్మల్‌కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంగా ఉన్న ఈపట్టణాన్ని రానున్న రోజుల్లో సర్వాంగ సుందరంగా చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్య, రహదారుల నిర్మాణం, పారిశుధ్యం మెరుగుదలకు కృషిచేస్తానని అన్నారు.

విశ్రాంత ఎస్ఐ సత్యనారాయణ మృతి



ఉప్పలగుప్తం, జూన్16(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లికి చెందిన విశ్రాంత ఎస్ఐ కేవీవీ సత్యనారాయణ(79) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంత కాలం ఉప్పలగుప్తం ఏఎస్ఐగా ఉన్నారు. అనంతరం ఆత్రేయపురం ఎస్ఐగా పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గా చిన్నా, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొలకోటి సత్తిరాజు, వుండ్రు రాజబాబు, అడబాల సత్యనారాయణ, యెరుబండి రాంబాబు, మంచెం బాబి, విచారం తెలిపారు.

29న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని పలు కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో భాగంగా సెంటాక్ ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల29న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యానాం పరిపాలనాధికారి మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. యానాం రీజియన్‌కు సంబంధిం పీఎం రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం పాఠశాలను కేంద్రంగా నిర్ణయించారన్నారు. ఉదయం 10నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. యానాంలో 54మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ముగిసిన చెడీ తాలింఖానా ఉచిత వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసిన స్వామినాయుడు, రమణబాబు

అమలాపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం గండు వీధిలో ఉన్న డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో చెడీ తాలింఖానా ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. 45రోజుల పాటు శిక్షణ అందించిన అనంతరం ముగింపు సభ నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు చేసిన చెడీ తాలింఖానా ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. పట్టణానికి చెందిన వంటెద్దు సత్తిబాబు తన మిత్రులతో కలిసి శ్రీకోనసీమ యుద్ధ కళా కేంద్ర అనే శిక్షణ సంస్థను స్థాపించారు. దీనిలోభాగంగా 52మంది విద్యార్థులకు కర్రసాము, కత్తిసాములో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పూర్తి చేసుకున్న విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీవీసీ విద్యాసంస్థల చైర్మన్ బోనం కృష్ణసతీష్, కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్ చేతులమీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఉచిత శిక్షణ ఇచ్చిన సత్తిబాబును దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, నాయకులు ఆశెట్టి ఆదిబాబు, పడాల నానాజీ, వంటెద్దు వెంకన్నాయుడు, వంటెద్దు బాబి, తిక్కిరెడ్డి నేతాజీ, దున్నాల దుర్గ, పనసా బుజ్జి, అయ్యల మల్లిబాబు, నల్లా అజయ్, గుర్రాల కన్నా, ఆర్డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాదుకు చెందిన గుంట షణ్ముఖరావు దంపతులు సోమవారం మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు రూ.11,000 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దాత దంపతులను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.

తహశీల్దార్‌గా సునీల్‌కుమార్



మామిడికుదురు, జూన్16(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు తహశీల్దార్‌గా పి.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాట్రేనికోన నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు డిప్యూటీ ఎమ్మార్వో కె.శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యాచారి ఉద్యోగ విరమణ చేశారు.

తహశీల్దార్‌గా సీహెచ్ భాస్కర్



రాజోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజోలు తహశీల్దార్‌గా సీహెచ్ భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన ఎస్ఎస్ఎస్ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. సఖినేటిపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న భాస్కర్ తహశీల్దార్‌గా ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భాస్కర్‌ను వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరంభంలోనే తల్లికి వందనం పథకం అమలు

మామిడికుదురు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం సంతోషదాయకమని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం నగదు జమ చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 67.27లక్షల విద్యార్థులకు తల్లికి వందనం కింద బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ చేశారని, గత ప్రభుత్వంతో పోలిస్తే 24,65,199మంది విద్యార్థులు అధికంగా లబ్ధి పొందారన్నారు. అర్హత ఉండి నగదు జమకాని వారు సంబంధిత పత్రాలతో స్థానిక సచివాలయంలో సంప్రదించి లబ్ధి పొందాలని కోరారు. నామన నాగేశ్వరరావు, కుంచే శ్రీనివాస్, చెల్లింగి సింహాచలం, కుంపట్ల బాబ్జి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మంగళవారం 11కేవీ భీమనపల్లి ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సూదాపాలెం, భట్నపాలెం, నంగవరం, భీమనపల్లి, విలసవిల్లి, సింగరాయపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

యనాం ఆలయాల్లో కానుకల లెక్కింపు

యానాం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో హుండీల కానుకలను లెక్కించారు. యానాంవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉన్న ఆలయాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ తహశీల్దార్ కె.జ్యోతి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం ఉదయం హుండీల కానుకలను లెక్కించారు. మహాలక్ష్మమ్మ ఆలయానికి రూ.13,294, యానాం పిల్లారాయ ఆలయానికి రూ.217,150, యానాం శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.243,080, శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి రూ.1,87820 ఆదాయం వచ్చింది. పుదుచ్చేరి దేవదాయశాఖ ఆదేశాలతో అలయ సముదాయ ఖాతాలో నగదు జమ చేయనున్నారు. అధికారులు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి

ముమ్మిడివరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వృద్ధుల హక్కులకు భంగం వాటిల్లితే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ప్రపంచ వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం కోర్టు ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఏజీపీ కాశి సిద్ధార్థకుమార్, ప్యానల్ లాయర్స్ కేఆర్కే రాజు, దాసరి సత్యనారాయణ, ఈఎస్ఎన్ బాబు, టి.నాగరాజు, టి.నాగరాజారావు, జి.రామారావు, ఎం.అలీహసన్, కేవీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

సింహాచలానికి ఎమ్మెల్యే నివాళి

అమలాపురం టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే సింహాచలం ఇటీవల మృతి చెందారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం గాజువాకలో సింహాచలం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట దంతులూరి వాసురాజు, కరణ్ పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ తీర్థం

ఉప్పలగుప్తం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మునిపల్లి, పెదగాడవిల్లి గ్రామాల ఆరాధ్య దేవత ముత్యాలమ్మతల్లి తీర్థం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మృగశిర కార్తెలో పౌర్ణమి అనంతర మొదటి మంగళవారం తీర్థం నిర్వహిస్తుంటారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఉత్సవం ఘనంగా జరిగింది. మేళతాళాలు, ఆసాదుల గరగనృత్య ప్రదర్శనలు, బాణసంచా కాల్పులతో ఎంతో ఉత్సాహంగా యువత ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.

భూమి కౌలు హక్కునకు బహిరంగ వేలం ప్రకటన

దేవాదాయ ధర్మదాయ శాఖ, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పి గన్నవరం మండలం మరియు మామిడికుదురు మండలం లలో గల వివిధ దేవస్థానముల మరియు సత్రముల తాలూకు భూములకు 2025-26 సంవత్సరం నుండి 2027-28 సంవత్సరం వరకు అనగా 3 సంవత్సరాల కాలమునకు కౌలునకు సాగు చేసుకోను హక్కునకు క్రింది తెలిపిన విధముగా దేవాదాయ-ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో బహిరంగ వేలం నిర్వహించబడును.

వ నెం	దేవాలయము పేరు	భూమి గల గ్రామము మరియు సర్వే నెంబరు	పాట పెట్టవలసిన భూమి వివరము	ధరావత్తు రూ.లలో	బహిరంగ వేలం పాట జరుగు ప్రదేశము,తేది, సమయము
1	శ్రీ అనందేశ్వర మల్లేశ్వర స్వామివారిదేవస్థానం, మానేపల్లి గ్రామము పి.గన్నవరం మండలం	పెదకందాలపాలెం 94/2	ఎ.1-64 సెంట్లు	రూ.2,000/-	శ్రీ అనందేశ్వర మల్లేశ్వర స్వామివారి దేవస్థానం, మానేపల్లి వద్ద ది.1/7/2025 మంగళవారము ఉ.9-00 లకు పాట నిర్వహించబడును.
		106/1	ఎ.0-96 సెంట్లు	రూ.2,000/-	
		75/1	ఎ.-24 సెంట్లు	రూ 500/-	
		మానేపల్లి 443/a 1B,442/4	ఎ.0.95 సెంట్లు (ఏకభుక్తి)	రూ.2,000/-	
2	శ్రీ కనక దుర్గ అమ్మవారి దేవస్థానం, మానేపల్లి గ్రామము పి.గన్నవరం మండలం	మానేపల్లి 482	ఎ.0-73 సెంట్లు	రూ.2,000/-	శ్రీ అనందేశ్వర మల్లేశ్వర స్వామివారి దేవస్థానం, మానేపల్లి వద్ద ది.1/7/2025 మంగళవారము ఉ.11-00లకు పాట నిర్వహించబడును.
3	శ్రీ మాలేశ్వరస్వామి వారి దేవస్థానం,పెదపట్నం గ్రామము పి.గన్నవరం మండలం	పెదపట్నం 57/5,54/2, 42/2	ఎ.1-64 సెంట్లు	రూ.3,000/-	శ్రీ మాలేశ్వరస్వామి వారి దేవస్థానం పెదపట్నం గ్రామము వద్ద ది 1/7/2025 మంగళ వారము మ.12-00 లకు పాట నిర్వహించబడును.
		109/4	ఎ.0-08 సెంట్లు	రూ.1000/-	
4	శ్రీ దుర్గాంబ అన్నదాన సత్రం, నాగుల్లంక గ్రామము పి.గన్నవరం మండలం	లూటుకుర్రు 227/3	ఎ.0-47 సెంట్లు	రూ.2000/-	గ్రామపంచాయతీ, లూటుకుర్రు వద్ద ది 1/7/2025 మంగళవారము మ.3-00 లకు పాట నిర్వహించబడును
		224/4	ఎ.1-51 సెంట్లు	రూ.3000/-	

పాటలో పాల్గొను ప్రతి ఒక్కరు ధరావత్తు చెల్లించి, సాల్వెన్సీ మరియు ఆధార్‌కార్డు తప్పనిసరిగా చూపించవలెను. మిగిలిన పాట షరతుల విషయమై ఆఫీసు నందు సంప్రదించగలరు.

రాజోలు
16/6/2025

కార్యనిర్వహణాధికారి
సెల్ నెం: 9441563164

మండపేట

ఏటిగట్టు రహదారిపై వాహనాల నిలిపివేత

• రహదారి ధ్వంసమవుతోందంటూ ఆవేదన
• ఇసుక ర్యాంపు నిర్వాహకులపై గ్రామస్థుల ఆగ్రహం


ఏటిగట్టుపై వాహనాలను నిలిపివేసిన గ్రామస్థులు

కపిలేశ్వరపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నాడ-కోటిపల్లి వెళ్లే ఏటిగట్టు రహదారిలో సోమవారం కపిలేశ్వరపురం శివారు సత్యనారాయణపురం వద్ద ఏటిగట్టుపై వాహనాలను గ్రామస్థులు నిలిపివేశారు. ఇసుక వాహనాల కారణంగా రహదారి అధ్వానస్థితికి చేరుకుందని వారు ఆరోపించారు. ఈ రహదారిలో అనేకచోట్ల దిగబడిపోవడంతో ప్రతి రోజూ ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఇంత జరుగుతున్నా ఇసుక ర్యాంపు నిర్వాహకులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా ర్యాంపుల నుంచి తడి ఇసుకను లారీల్లో తరలిస్తుండటంతో రహదారి చిత్తడిగా మారిందని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను వారు కోరారు.

డిగ్రీ కాలేజీలో యోగాంధ్ర తరగతులు

రావులపాలెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. కళాశాల క్రీడా ప్రాంగణంలో యోగా, మెడిటేషన్, ఆసనాలను విద్యార్థులు, అధ్యాపకులు వేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ కుమార్, పీడీ ఎన్.యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు, అధ్యాపకులు బీవీఎస్ రెడ్డి, సుబాషిణి, సుమలత, రజనీ పాల్గొన్నారు.


రావులపాలెం డిగ్రీ కళాశాలలో యోగా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ద్వారపూడి వస్త్ర మార్కెట్‌పై మాజీ ఎంపీపీ ఫిర్యాదు

మండపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో వున్న మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో వ్యాపారులు, సంఘ నిర్వాహకుల తీరుపై మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి ధ్వజమెత్తారు. నిబంధనల మేరకు వ్యాపారులు వ్యవహరించటం లేదని, ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారులు గండికొడుతున్నారన్నారు. సంఘం లెక్కలో 669 దుకాణాలు ఉండగా, ప్రభుత్వ లెక్కల్లో కేవలం 327 దుకాణాలు చూపిస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా 306 దుకాణాలు బినామీలు వున్నాయన్నారు. జీఎస్టీ చెల్లించకుండా వ్యాపారులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. ద్వారపూడి బట్టల మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. వస్త్ర మార్కెటింగ్ సంఘ ప్రతినిధులు సంఘ ఉపాధ్యక్షుడు పల్ల బాబు మాట్లాడుతూ అసోసియేషన్ వద్ద అడబాల బాబ్జి తన కుమారుడు పేరిట షాపును తీసుకుని అద్దె సక్రమంగా చెల్లించటం లేదన్నారు. దీంతో షాపును ఖాళీ చేయాలని సంఘం నిర్ణయించిందన్నారు. దీంతో బాబ్జి అసోషియేషన్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వ్యాపారులంతా నిబంధనల మేరకు పన్నులు చెల్లిస్తున్నారని, ఎక్కడా అవినీతికి పాల్పడటం లేదన్నారు. బాబ్జి ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు.


ఆత్రేయపురంలో రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం ఆత్రేయపురంలో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.20.65 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రజకపేటలో నిర్మించనున్న వాటర్ ట్యాంకు, బండారు కాలనీలో నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ గెడ్డం సుధ, ఎంపీడీవో వెంకటరామన్, అధికారులు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.3.34 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,34,555 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

కె.గంగవరం తహశీల్దార్‌గా శ్రీరామ్‌ప్రసాద్

కె.గంగవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల తహశీల్దార్‌గా శ్రీరామ్ ప్రసాద్ నియమితులైనారు. ప్రస్తుతం ఈయన కె.గంగవరం మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సోమవారం శ్రీరామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐ వెంకట్రావు, డిప్యూటీ తహశీల్దార్ మురళీ, మండలంలోని వీఆర్వోలు, రేషన్‌డీలర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటి వరకూ తహశీల్దార్‌గా పని చేసిన బండి మృత్యుంజయరావు రామచంద్రపురం తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కె.గంగవరం తహశీల్దార్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు పలికారు.

నోట్‌బుక్స్ పంపిణీ

రాయవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం దాత వితరణతో నోట్ బుక్స్ పంపిణీ నిర్వహించారు. హెచ్‌ఎం నూలు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేమనరెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు దాతలు సహకారాలు అందిస్తే చదువులో వారు మరింత రాణిస్తారన్నారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చింతా వెంకటరెడ్డి కుమారుడు సుహాన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని పాఠశాలలో 250 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం దాత వెంకటరెడ్డి హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి 50వేలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతను హెచ్‌ఎం ఆదినారాయణ అభినందించారు. కార్యక్రమంలో మల్లిడి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి

రాయవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాయవరం తహశీల్దారు ఐపీ శెట్టికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

రాయవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని తహశీల్దారు ఐపీ శెట్టి అన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారిగా పనిచేసి మండపేట ఏవోగా బదిలీపై వెళ్తున్న కొప్పిశెట్టి ప్రభాకర్‌ను ఉద్యోగులు సన్మానించారు. అనంతరం తహశీల్దారు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రభాకర్‌ను పలువురు సత్కరించారు.

మంత్రి సుభాష్‌కు మంత్రి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్‌కు పలువురు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి లోకేష్‌ను సోమవారం సీఎం చంద్రబాబు విశాఖ పర్యటన సందర్భంగా నోవాటెల్‌లో ఎమ్మెల్యేలు, మంత్రులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ జన్మదినం మంగళవారం అని తెలుసుకున్న మంత్రి లోకేష్ ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో అక్కడున్న పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రి సుభాష్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తల్లికి వందనం పథకంతో పేదల కుటుంబాల్లో వెలుగులు

టీడీపీ జిల్లా అధ్యక్షురాలు అనంతకుమారి



కొత్తపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంతో పేద విద్యార్థుల కుటుంబాల్లో వెలుగులు నింపాయని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. సోమవారం ఆమె కొత్తపేటలో మాట్లాడుతూ తల్లికి వందనం అనేది ఒక సంక్షేమ పథకం కాదని ప్రతి కుటుంబానికి ఇచ్చిన గౌరవమన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా రూ.5540 కోట్లు విడుదల చేయగా కూటమిప్రభుత్వం రూ.10,091 కోట్లు విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వంలో 42లక్షల మందికే పరిమితమైన ఈ పథకాన్ని 67లక్షలకు పైగా విద్యార్థులకు అందించారన్నారు. వైసీపీ నేతలు ఎంత అసత్య ప్రచారం చేసినా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె అన్నారు.


ఆర్డీవో అఖిలకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరుతూ సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శులు మేడిశెట్టి దుర్గమ్మ, డి.ఆదిలక్ష్మీ మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందచేశారు.


దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేస్తున్న వాసంశెట్టి సత్యం

దివ్యాంగులకు ఫౌండేషన్ అండగా ఉంటుంది

కె.గంగవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యం అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల దివ్యాంగులకు ఫౌండేషన్ ద్వారా బ్యాటరీ ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిశెట్టి రవికుమార్, మరివాడ సూరిబాబు, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ఆలమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జొన్నాడ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర కిట్లను పంపిణీ చేశారు. విద్యా కమిటీ ఛైర్మన్ మెర్ల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దింటి అనంత శ్రీనివాస్‌ల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బెల్టులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, నాయకులు ద్వారంపూడి దొరబాబు, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, తాడి మోహర్ ఆదిత్య, నల్లమిల్లి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలి

ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం వాడపల్లిలో ఆత్రేయపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ చిన్నారులో ప్రబలే అతిసార వ్యాధిపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు విటమిన్-ఏ డ్రాప్స్‌ను ఎమ్మెల్యే చేతులు మీదుగా ప్రారంభించారు. వైద్యాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సవరించరూ..

అమలాపురం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ ఈఆర్వో కార్యాలయం సోమవారం జనంతో కిక్కిరిసిపోయింది. తల్లికి వందనం పథకం వర్తించాలంటే విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటి ఉండరాదు. తమ విద్యుత్ బిల్లులను సవరించి తమకు తల్లికి వందనం వర్తింప చేయాలని వేడుకున్నారు.

దివ్యాంగుల శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యం

కృత్రిమ అవయవాల పంపిణీలో మంత్రి సుభాష్


దివ్యాంగునికి బ్యాటరీ మోటార్ సైకిల్ అందజేస్తున్న మంత్రి సుభాష్, అలింకో ప్రతినిధులు

ద్రాక్షారామ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం మండలం చోడవరం విజయ ఫంక్షన్ హాలులో 270 మంది విభిన్న ప్రతిభావంతులైన దివ్యాంగులకు రూ.80 లక్షలతో అలింకో సంస్థ సమకూర్చిన కృత్రిమ అవయవాలు, ఉపకరణాలను మంత్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) ద్వారా కోనసీమ జిల్లాకు రూ.4 కోట్లతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ఏడాదిలో అలింకో సంస్థ నియోజకవర్గంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అంగవైకల్యం లోపాలను గుర్తించి అర్హులందరికీ కృత్రిమ అవయవాల పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో రూ.86 లక్షలతో 68 బ్యాటరీ ఆపరేట్ మోటారు సైకిళ్లు, 41 ట్రై సైకిళ్లు, 62 వీల్‌చైర్లు, 30 నడక కర్రలు, 22 డిజిటల్ వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అలింకో సంస్థ డీజీఎం సంజయ్ సింగ్, పీఅండ్‌వో రవి కుమార్, జడ్పీసీఈవో లక్ష్మణరావు, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, కూటమి నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం కమ్మిరెడ్డిపాలెం నుంచి వాడపాలెం వెళ్లే రహదారిని పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో పరిశీలించారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల్లతో ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ జిల్లా అధికారి పి.రామకృష్ణారెడ్డి, పీఆర్ డీఈఈ ఏవీ సూర్యనారాయణ, జేఈ వీరభద్రరావు తహశీల్దారు రాంబాబు, కొత్తపేట, వాడపాలెం సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, త్సామా బాబు, బూసి భాస్కరరావు, బండారు బుల్లి తాత, పప్పుల కొత్తయ్య, గనిశెట్టి వీరేష్, దేవపాటి వెంకటేశ్వరరావు, మిద్దే ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం నుంచి వాడపాలెం రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

మండల పరిధిలోనే సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేయాలి

ఆలమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి మండల స్థాయిలోనే బదిలీలు చేపట్టాలని సంఘ నాయకులు సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం అందించారు. రూ.30 వేల జీతం తీసుకునే తాము ఇతర మండలాలకు వెళ్లాలంటే రవాణాకు అదనపు ఖర్చు అవుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి మండల పరిధిలోనే బదిలీ చేసేలా ప్రభుత్వంతో చర్చించాలని ఉద్యోగుల సంఘ నాయకులు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే బండారు వారికి హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అర్హతలున్న రైతులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సద్గురుమూర్తి

కె.గంగవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అర్హతలున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందాలని వ్యవసాయశాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి అన్నారు. నూతనంగా నియమితులైన ఆయన సోమవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతనంగా నియమితులైన సద్గురుమూర్తిని ఫెర్టిలైజర్స్ యజమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన బలుసు రవి కపిలేశ్వరపురం మండల వ్యవసాయశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఈయనకు వ్యవసాయశాఖ కార్యాలయంలో వీడ్కోలు పలికారు.

డయేరియాపై అవగాహన కలిగి ఉండాలి

కపిలేశ్వరపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డయేరియా పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు నివారణపై జాగ్రత్తలు పాటించాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి విజయదీపిక అన్నారు. సోమవారం అచ్యుతాపురంలో డయేరియా నివారణపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా టీబీ ఫ్రీ ఇండియాపై ప్రతిజ్ఞ చేయించారు. క్షయవ్యాధిపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆగస్టు 30 వరకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, 104 టీం పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందజేత


విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాయవరం ఎంపీపీఎస్ మోడల్ ప్రైమరీ పాఠశాల, నెంబర్-1 పాఠశాల విద్యార్థులకు సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లచ్చిరెడ్డి వెంకటరమణ, ఎం.విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు కె.నాగిరెడ్డి, ఎం.రామకృష్ణ, లచ్చిరెడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు దేవిశెట్టి చిన్ని, దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, పీఎంసీ ఛైర్మన్ సీహెచ్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా సతీష్

ఆలమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండపేట పట్టణ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా ఆలమూరుకు చెందిన పార్టీ సీనియర్‌నేత వంటిపల్లి సతీష్‌కుమార్‌ను నియమించారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణ పరిశీలకుడిగా నియమితులైన సతీష్‌కుమార్‌ను టీడీపీ మండపేట నాయకులు పలువురు అభినందించారు. సంస్థాగత ఎన్నిక పరిశీలకునిగా నియమించిన పార్టీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన చెప్పారు. సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన ఆయన్ను ఆలమూరులో పలువురు నాయకులు అభినందించారు.


సతీష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తల్లికి వందనంపై.. వైసీపీ ఆరోపణల్లో వాస్తవం లేదు

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లుల ఖాతాలో వేసిన తల్లికి వందనం సొమ్ముకు మంచి స్పందన వచ్చిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పిల్లల తల్లులు హర్షం వ్యక్తం చేస్తుండగా, వైసీపీ నేతలు మాత్రం తల్లికి వందనం పథకాన్ని చూసి తట్టుకోలేక కడుపుమంటతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైసీపీ శ్రేణుల ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు.

గత ప్రభుత్వ పథకాలనే అమలు చేస్తున్నారు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పథకాలను ఎండగడుతూనే మరోపక్క అవే పథకాలను ప్రభుత్వం ఎందుకు అమలు చేస్తున్నదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. మండపేటలో సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత పాలనలో రాష్ట్రం నాశనం అయిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఉద్యోగమేళాలో 78 మందికి నియామక పత్రాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఉపాధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 78 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు హర్ష, దుర్గా ప్రసాద్, తేజ, సతీష్, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉద్యోగ భవన్‌లో కేక్ కట్ చేసి ముందస్తు వేడుకలు నిర్వహించారు.

వ్యవసాయ అధికారిగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

మండపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా కె.ప్రభాకర్ నియమితులయ్యారు. రాయవరం మండలం నుంచి ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వ్యవసాయ అధికారి ఏసుబాబు పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం మండలానికి బదిలీ అయ్యారు.

పరిపాలన అధికారి ప్రసాద్ బదిలీ

మండపేట మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న ప్రసాద్ బిక్కవోలు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ ఇంకా నియమించలేదు.

'హామీలు అమలుచేయని ప్రభుత్వం'

• ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా వంచిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్ విమర్శించారు. సోమవారం రామచంద్రపురం వైసీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వ మోసంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ బోస్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఈ పుస్తకాన్ని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఆలమూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి 11 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మడికి కూరగాయల మార్కెట్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్ అధ్వర్యంలో దాడులు జరపగా ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయశాఖ మండల అధికారిగా రవి బాధ్యతల స్వీకరణ

కపిలేశ్వరపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా బలుసు రవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన రమేష్‌కుమార్ రాయవరం బదిలీ అయ్యారు. వ్యవసాయాధికారి రవి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.